ప్రజాశక్తి
గురువారం 17 అక్టోబర్ 2024 5 విజయనగరం

అధ్యాపక పోస్టుల భర్తీలో
మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశమివ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సిఇఆర్‌టిలో డిప్యూటేషన్‌పై అధ్యాపక పోస్టుల భర్తీలో అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా అవకాశమివ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల విద్యాశాఖ ఎస్‌సిఇఆర్‌టిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని, గవర్నమెంట్, జెడ్‌పి ఉపాధ్యాయులు అర్హులుగా పేర్కొన్నారని, మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా పాఠశాల పరిధిలోకి తీసుకొచ్చిన విషయాన్ని ఈ నోటిఫికేషన్‌లో మరిచారని విమర్శించారు. 010 హెడ్ కింద జీతాలు తీసుకునేవారు అర్హులని చెప్తూనే, మరోకవైపు మున్సిపల్ ఉపాధ్యాయులను మినహాయించడం సరికాదని తెలిపారు. తక్షణం మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా ఈ పోస్టులకు అవకాశమిస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంకా 60మంది అతిసార బాధితులు

- తాజాగా చేరిన మరో ఇద్దరు
- కోలుకుంటున్న రోగులు
- పరామర్శించిన కలెక్టర్ అంబేద్కర్, జెడ్‌పిచైర్మన్, ఎస్‌టి కమిషన్ చైర్మన్
- కలుషిత నీరే కారణం

గుర్ల జెడ్‌పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గుర్ల, ఘోషాడ, పున్నపురెడ్డిపేట, గూడెం, కెల్ల గ్రామాల్లో నాలుగు రోజుల క్రితం ప్రబలిన అతిసార గుర్ల, ఘోషాడ గ్రామాల్లో ఇంకా అదుపులోకి రాలేదు. ఓవైపు బాధితులు కోలుకుంటుండగా, తాజాగా బుధవారం గుర్ల గ్రామానికి చెందిన మరో ఇద్దరు వైద్య శిబిరంలో చేరారు. గుర్ల గ్రామానికి చెందిన వారు సోమవారం ఒకరు, మంగళవారం నలుగురు మృతి చెందడంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ప్రస్తుతం గుర్లలోని జెడ్‌పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 52మంది, జిల్లాకేంద్రాస్పత్రిలో నలుగురు, చీపురుపల్లి సిహెచ్‌సిలో నలుగురు మొత్తంగా 60మంది చికిత్స పొందుతున్నారు. వీరంతా గుర్ల, ఘోషాడ గ్రామాలకు చెందిన వారే. వీరిలో ఎం.నాగరాజు, ఎన్.అప్పలస్వామి, జె.పైడమ్మ, జి.రాములమ్మ, అప్పలనర్సమ్మ తదితరులు ఉన్నారు.

అతిసార అదుపులో ఉంది
ఇంటింటికీ క్లోరినేటెడ్ నీరు సరఫరా : కలెక్టర్

గుర్లలో డయేరియా అదుపులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అతిసారతో బాధపడుతున్న వారి కోసం మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. పూర్తిగా కోలుకున్న తర్వాతనే వారిని ఇంటికి పంపిస్తామన్నారు. బుధవారం కలెక్టర్ గుర్ల లో పర్యటించి అతిసారతో బాధపడుతున్న వారిని పరామర్శించి, కారణాల పై ఆరా తీసారు. మొదటి రోజున విరేచనాలు తగ్గిన వారు ఇళ్లకు వెళ్ళడం, వారు వినియోగించిన టాయిలెట్లను వారి కుటుంబ సభ్యులు వినియోగించడం వలన మిగిలిన వారికి సోకినట్లు గుర్తించామని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల కూడా డయేరియా సోకి ఉంటుందని తెలిపారు. గుర్ల గ్రామంలో 5బోర్లలో నీరు కలుషితమైనట్లు అధికారులు గుర్తించా రన్నారు. వాటిని పూర్తిగా వాడకుండా చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు ఎవరూ డయేరియా వ్యాధితో మృతి చెందలేదని, చనిపోయిన వారు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారని తెలిపారు. వాస్తవ పరిస్థితుల పై వెంటనే నివేదిక నివ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బ్లీచింగ్, స్ప్రే చేయాలని, కేసులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని డిపిఒకు ఆదేశించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంపావతి నీటి ప్రవాహం లో ఎగువ ప్రాంతం నుండి కాళేబరాలు కొట్టుకురావడం వల్లనే నీరు కలుషితం అయి గుర్ల లో అతిసారం ప్రబలింది అనే ప్రచారం అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమా శంకర్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు, డిపిఒ వెంకటేశ్వర రావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్య వాణి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదో బోరుబావుల్లో నీరు కలుషితం

గుర్ల గ్రామంలో ఐదు బోరు బావుల నీటి శాంపిల్స్ ను పరీక్షించామని, 5 ప్రైవేటు బోరు బావుల నీరు కలుషితంగా ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ఇ ఉమా శంకర్ తెలిపారు. వెంటనే వాటిని సీజ్ చేయాలనీ, ఇంటింటికి క్లోరినేటెడ్ నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

డయేరియాతో మరణించ లేదనడం సరికాదు : సిపిఎం

డయేరియాతో ఐదుగురు మరణిస్తే .. దానివల్ల ఎవరూ మరణించలేదని కలెక్టర్ ప్రకటించడం సరైనది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ అన్నారు. వెంటనే అతిసార నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. గుర్లలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వివిధ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణాన్ని గుర్తించి నివారణా చర్యలు తీసుకోవా లన్నారు. వైద్యసేవలు పట్ల రోగులకు సంతృప్తిగా లేరని, వెంటనే మెరుగైన వైద్య సేవలందించాలని అన్నారు. మరణించిన వారి కుటుంబా లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.

శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి : జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

రోగులతో పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరంటౌన్, గుర్ల : గుర్లలోని వైద్యశిబిరంలోను, జిల్లా కేంద్రాస్పత్రిలోను అతిసారతో బాధపడుతున్న బాధితులను జెడ్‌పిచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నలుగురు మతి చెందినా తాగునీటి సరఫరా లోపాలను సరిదిద్దేవారే లేరన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం స్పందించాలన్నారు. బాధ్యత తీసుకొని సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జెడ్‌పిలో నిధులకు కొరత లేదని, వెంటనే శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి అతిసారానికి కారణాలను అడిగారు. జిల్లా పరిషత్‌లో నిధులు ఉన్నాయని, వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌కు తెలిపారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిలు గ్రామం మొత్తం బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని సూచించారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ పరామర్శ

జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు పరామర్శించారు. గ్రామంలో అతిసార ఉత్పన్నమైన పరిస్థితులు, ప్రస్తుతం వారి ఆరోగ్యస్థితి వాకబు చేశారు. వైద్యులను, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడును రోగులకందుతున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు.మెరుగైన వైద్యసేవలు అందించమని కోరారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయ పరిచి, అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

సిరిమాను చెక్క కోసం ఎగబడిన జనం

అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి దర్శనం కోసం బుధవారం చదురుగుడి వద్ద భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయానికి రెండు వైపులా ఉన్న బారి కేడ్లలో భక్తులు దర్శనం కోసం గంటలు కొద్ది క్యూ లైన్లో వేచి ఉన్నారు. ఎమ్‌జి రోడ్డు వైపు, మూడు లాంతర్లు నుంచి కోట వైపు ఉన్న బారి క్యేడ్లలో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మరో వైపు సిరిమాను చెక్క కోసం భక్తులు ఎగబడ్డారు. సిరిమాను చెక్కలు ఇంటిలో బీరువాల్లోను, వ్యాపార సంస్థల్లోను ఉంచితే మంచి జరుగు తుందని భక్తుల నమ్మకం. ఈనేపథ్యంలోనే చెక్కను తీసుకెల్లేందుకు భక్తులు ఎగబడ్డారు. ఇదే అదునుగా కొంతమంది చెక్కను ముక్కలుగా చేసి భక్తులకు విక్రయించారు. మరోవైపు రైల్వేస్టేషన్ వద్దగల వనంగుడిలోనూ అమ్మవారిని వందలాది మంది దర్శించుకున్నారు.

పండగలో స్కాట్స్ అండ్ గైడ్స్ సేవలు

పైడితల్లి అమ్మవారి పండుగ సంబరాలలో గత మూడు రోజులుగా జరిగిన కార్యక్రమాలలో హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లు సేవలు అందించారు. సెట్విజ్ సిఇఒ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఛైర్మన్ సదరం కోటేశ్వరరావు , సెక్రటరీ దుంపల వెంకటప్పల నాయుడు, రాష్ట్ర చీఫ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్ పాల్గొన్నారు. వాలంటీర్లతో పాటు హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ విజయనగరం జిల్లా కమిషనర్ గొల్లపూడి పథ్విరాజ్‌ను అధికారులు అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడు ఆత్మహత్య

రాకేష్ (ఫైల్)

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బాలికపై అత్యాచారం కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలుపట్టాలపై బుధవారం ఉదయం శవంగా కనిపించాడు. ఈ సంఘటన పార్వతీ పురం పట్టణంలో కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం...

పార్వతీపురం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి రాకేష్(18) ఇటీవల గ్రామంలోని ఒక బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడిని విచారణ నిమిత్తం పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకర్ మంగళవారం రాత్రి స్టేషనుకు తీసుకొచ్చారు. కొద్ది క్షణాల్లోనే నాటకీయంగా నిందితుడు రాకేష్ అక్కడి నుంచి తప్పించుకొని పరారయ్యాడు. ఈ విషయాన్ని ఎస్ఐ వారి కుటుంబీకులకు తెలియ జేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం బెలగాం రైల్వేస్టేషన్ శివారులో పట్టాలపై ఉన్న శవాన్ని రైల్వే పోలీసులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రాకేష్‌గా గుర్తించారు. కుమారుడి మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని బయటకు ఎలా వదులుతారని రాకేష్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువకుడి మృతికి పోలీసులే బాధ్యత వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కర్రి అప్పడు, గౌరీ దంపతుల రెండో కుమారుడు రాకేష్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పెద్ద కుమారుడు రామకృష్ణ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ సంఘటనపై డివిజనల్ పోలీస్ అధికారి అంకిత సురాన, సిఐ గోవిందరావు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా ఆనందగజపతి ఆడిటోరియం

అబ్బుర పర్చిన సాంస్కృతిక ప్రదర్శనలు, గాన, గాత్ర కచేరీలు

అలరిస్తున్న శాస్త్రీయ సంగీత కార్యక్రమం (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉత్సవాల్లో ప్రదర్శించిన కళారూపాలు అబ్బురపర్చాయి. వీటిలో ఒకదాన్ని మించి మరొకటి అన్నట్టుగా ఉన్నప్పటికీ ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీతం, నృత్యకళా ప్రదర్శనలు, గాత్ర, నాదస్వరం కచేరీలు అమితంగా ఆకర్షించాయి. వీటితోపాటు భక్తి గేయాలు, వీణ, క్లాసికల్ డ్యాన్సులు, వయోలిన్, మృదంగం, తబలా వాయిద్యాలు, ఘంటసాల వారి సినిమా పాటలతో 13, 14తేదీల్లో ఆనందగజపతి ఆడిటోరియం ఆనంద హేలగా మారింది. ఈ వేదికపై సుమారు 30 బృందాలు ప్రదర్శనలిచ్చాయి. మొత్తంగా 250మందికిపైగా పాల్గొన్నారు. చిన్నారులు, యువతీ యువకులు మొదలుకుని వృద్ధుల వరకు తమదైన శైలిలో ప్రదర్శించడం గమనార్హం. వీరిలో ఎక్కువ మంది స్థానిక మహారాజ ప్రభుత్వ సంగీత కళాశాలలో అనుబంధం ఉన్నవారే ఉండడం మరో విశేషం. పసందైన శాస్త్రీయ సంగీతంతో ప్రేక్షకులకు వీణుల విందును అందించారు. మన రాష్ట్రంలోనూ, ప్రత్యేకించి మన జిల్లాలోనూ ప్రసిద్ధి చెందిన భరత నాట్యంలో కళాకారులు అబ్బురపర్చారు. గాత్ర కచేరీలు సభికులతో చప్పట్లు కొట్టించాయి. వీటితోపాటు మరికొన్ని వేదికల్లో నిర్వహించిన కవి సమ్మేళనాలు, పౌరానిక నాటక ప్రదర్శనలు, జనపద గేయాలు, తప్పెగుళ్ల కూడా సభికులను ఎంతో ఆకర్షించాయి. ఈ వేదికకు జిల్లా పౌర సంబంధాలు, సమాచార శాఖ డివిజినల్ పిఆర్‌ఒ జానకమ్మ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఇ ఉమాశంకర్, ఎంఆర్ సంగీత కళాశాల శాస్త్రి నిర్వాహకులుగా వ్యవహరించారు.

నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

- తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి
- భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి
- వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచీ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఎక్కడా పారిశుధ్య సమస్య రాకూడదని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఈఓపిఆర్‌డిలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ, వైద్యారోగ్యం, గ్రామీణ నీటి సరఫరా శాఖలు తమ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. గుర్ల డయేరియా సంఘటనలు ఎక్కడా పునరావతం కాకూడదని స్పష్టం చేశారు. గుర్లలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు తాహశీల్దార్, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి అక్కడే ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చూపే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి ట్యాంకులు, రక్షిత తాగునీటి పథకాలు క్లోరినేషన్ చేయాలని సూచించారు. రానున్న రెండు రోజులపాటు జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు మండలాల్లోనే ఉండాలని సూచించారు.

కొత్తగా తెర్లాం, సంతకవిటి మండలాల్లో ఇసుక రీచ్‌లు ప్రారంభమయ్యాయని కలెక్టర్ చెప్పారు. దీనివల్ల ఇసుక తగినంత అందుబాటులోకి వస్తుందన్నారు. వాగులు, గెడ్డలు వద్దనున్న థర్డ్ ఆర్డర్ రీచ్‌లనుంచి ఎడ్ల బళ్లద్వారా, ట్రాక్టర్ ద్వారా సొంత అవసరాలకు మాత్రం ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. బ్రిడ్జిలు, త్రాగునీటి పథకాల వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని, ఎవరైనా తవ్వకాలు సాగిస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు గ్రీవెన్స్ ఫిర్యాదులపై దృష్టిపెట్టి, పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అనుమతి పొందిన ఉపాధి పనులన్నిటినీ వెంటనే ప్రారంభించి, సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డ్వామా పీడీ ఇ.సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు పల్లె పండగలో పాల్గొననున్న మంత్రి కొండపల్లి

రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10:30 గంటలకు బొండపల్లి మండలం గొల్లుపాలెం 11:30 గంటలకు మరువాడ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు గజపతినగరం మండలం పురిటిపెంట, 4 గంటలకు మల్లు నాయుడుపేట, 4.30 గంటలకు మరుపల్లిలో పల్లెపండుగ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు

వసతి గృహాలను సందర్శించిన జడ్జి

విద్యార్థినులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

ప్రజాశక్తి- రాజాం

రాజాం పరిధిలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని, ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. వసతి గృహాల గదులు, వంటగది, స్టోర్ రూమ్, రోజువారి అందిస్తున్న ఆహార మెనూను పరిశీలించారు. బాలురు, బాలికలకు అందుతున్న భోజన, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలు తదితర అంశాలను స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఆడపిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకున్నారో లేదో అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజాం ప్రభుత్వ న్యాయవాది ఎస్. పోలరావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఈ.సి.హెచ్.జయదేవ్, సెక్రెటరీ వై. ఈశ్వరరావు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి వివిధ క్రీడలకు ఎంపిక పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు వివిధ క్రీడా అంశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామనిస్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 17న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ఎంపికపోటీలు విజయనగరం కోడి రామ మూర్తి వ్యాయామశాల, వాలీబాల్,క్రికెట్ విజ్జి స్టేడియం, బాక్సింగ్ రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలోను జరుగుతాయని తెలిపారు. 18నరోప్ స్కిప్పింగ్, మాల్కుంబ్ విజయనగరంలోని పిఎస్ఆర్ స్కూల్‌లోను, చదరంగం పోటీలు పార్వతీపురంలోని డివిఎం స్కూల్‌లోను, 19 న హాకీ రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలోను, అండర్ 17 క్రికెట్ ,అథ్లెటిక్స్ విజ్జి స్టేడియంలోను, త్రోబాల్ రాజీవ్ గాంధీ క్రీడా మైదానం, బాల్ బ్యాడ్మింటన్ ఎస్.కోట ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో జరుగుతాయని తెలిపారు. 21 న షటిల్ బ్యాడ్మింటన్ రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలోను, కబడ్డీ పోటీలు రఘుమండ జెడ్‌పి హైస్కూలు మైదానం, 22 న బాలికల వాలీబాల్ భోగపురం హైస్కూల్, ఖోఖో పోటీలు మరుపల్లి జెపి హైస్కూలు గ్రౌండ్‌లోను నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు అన్ని ఎంపిక పోటీలకు ఉదయం 9 గంటలకు ఆయా వేదికలకు చేరుకోవాలని తెలిపారు.

జనావాసాల మధ్యే వైన్‌షాపులు

పెదతాడివాడలో అడ్డుకున్న గ్రామస్తులు

జరజాపు పేటలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాప్

ప్రజాశక్తి-నెల్లిమర్ల/డెంకాడ

జిల్లాలోని పలు మండలాల్లో జనావాసాల మధ్య మద్యం షాప్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యకమవుతోంది. ప్రధాన రహదారికి 220 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిబంధనలను మద్యం వ్యాపారులు తుంగలో తొక్కుతున్నారు. కొన్నిచోట్ల గతంలో ప్రభుత్వ మద్యంషాపులు నడిపిన భవనాల్లోనే ఏర్పాటు చేయగా, మరికొన్నిచోట్ల జనావాసాల మధ్య ఏర్పాటు చేశారు. డెంకాడ మండలం పెద్దతాడివాడలో గ్రామంలో ఏర్పాటు చేసిన మద్య షాపును గ్రామస్తులంతా అడ్డుకున్నారు. గతంలో ఇక్కడ మద్యం షాపు నడిచినప్పటికీ అప్పట్లో కూడా మహిళలు ఫిర్యాదు చేశారు. షాపు చుట్టూ ఇళ్ల నిర్మాణాలు జరగడంతో స్థానికులతో పాటు గ్రామస్తులు ఇక్కడ షాపు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు.

నెలిమర్ల నగర పంచాయతీ పరిధిలో 6 మద్యం షాపులు మంజూరు కాగా వాటిలో జరజాపుపేటలో ఒకటి, సతివాడలో ఒకటి జనావాసాల మధ్య ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ఉన్న మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జరజాపుపేటలో షాప్ గ్రామానికి దూరంగా ఉండాల్సింది పోయి జన వాసాల మధ్య ఏర్పాటు చేశారు. రహదారి పక్కన నిత్యం వాహనాలు తిరుగుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగడంతోపాటు, షాప్ పక్కనే నివాస గృహాలు ఉన్నందున ఇబ్బంది కలిగే అవకాశం ఉందని అంటున్నారు. సతివాడలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాప్‌ను మహిళలంతా వ్యతిరేకిస్తున్నారు.

వేపాడ : మండలంలోన బొద్దాం గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేశారు. జనావాసాల మధ్య, గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేయడం పట్ల పలువురు వ్యతిరేకిస్తున్నారు.

గజపతినగరం : గజపతినగరం మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారికి కూతవేటు దూరంలో, మహంకాళమ్మ ఆలయానికి సమీపాన మద్యం షాపులు ఏర్పాటు చేశారు. ఈ మద్యం షాపునకు ఎదురుగా విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. ఈనేపథ్యంలో అక్కడ మద్యం షాపుల ఏర్పాట్లు పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నివాసాల మధ్యలో మద్యం షాపు పెట్టవద్దు

బొబ్బిలి : నివాసాల మధ్యలో మద్యం షాపులు పెట్టవద్దని ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని 17,27 వార్డులకు చెందిన మద్యం షాపు అల్లంరాజువీధి హెర్బర్ట్ డాక్టర్ సందులో పెట్టడంతో ప్రజలు, మార్కెట్ కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. హెర్బర్ట్ డాక్టర్ సందులో మద్యం షాపు పెట్టవద్దని ఎమ్మెల్యే బేబినాయన ఎక్సైజ్ శాఖాధికారులకు లేఖ రాశారన్నారు. అయినప్పటికీ కొంతమంది వ్యాపారులు షాపు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మద్యం షాపు పెడితే అడ్డుకుంటామని చెప్పారు.

మెరకముడిదాం : ఎజను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్‌పి ఛైర్మన్

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

వ్యసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఏవిధమైన ఇబ్బందులూ కలగకుండా అధికారులు చూడాలని జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంపిపి తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ పాల్గొని అన్ని శాఖల అధికారుల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎఒ శ్రావణి తేజ వ్యవసాయం గురించి మాట్లాడుతూ మండలంలో అందరి రైతులకూ ఈక్రాప్ నమోదు చేశామన్నారు. వ్యవసాయ బోర్‌లకు ఉచిత విద్యుత్ సరఫరా జరిగే విధంగా ప్రభుత్వం చూడాలని, వ్యవసాయానికి విద్యుత్ మీటర్లను రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని జెడ్ ఛైర్మన్ చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, ఎంపిడిఒ భాస్కరరావు, తహాశీల్దార్ రఫిజ్, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్కెఫెడ్ రాష్ట్ర ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలన్నారు. అనంతరం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో తహాశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ భవాని, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

బొబ్బిలి: క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని డిప్యూటీ డిఇఒ కె.మోహనరావు అన్నారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలకు ప్రవాస భారతీయులు వాసవి సంఘం, లెర్న్ అండ్ హెల్ప్ ఆధ్వర్యంలో రూ.50వేలు విలువ చేసే పుస్తకాలను పాఠశాల లైబ్రరీకు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంచేందుకు లైబ్రరీ ఎంతో దోహదం చేస్తుందన్నారు. లైబ్రరీను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని చెప్పారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనాలను పరిశీలించారు. భోజనాల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వాసు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఎలిమెంటరీ పాఠశాల హెచ్.ఎం ఉషారాణి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక రీచ్ ప్రారంభం

తెర్లాం: మండలంలోని కుసుమూరులో బుధవారం ఇసుక రీచ్‌ను టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, నాయకులు నర్సుపల్లి వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ డిడి డి.నరసింహారెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ జి. సత్యనారాయణ, విఆర్‌ఒ నర్సింనాయుడు, మండల నాయకులు శంకరరావు, రామ్మూర్తి నాయుడు, భాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం

శృంగవరపుకోట: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు భరణికాన హారిక, పంపాన మౌనికలు ఉత్తరాంధ్ర స్థాయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించారు. విజయనగరం పైడితల్లమ్మ తల్లి జాతర సందర్భంగా సోమవారం విజ్జి స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వీరిద్దరూ ద్వితీయ స్థానం సాధించారని చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరికి ట్రోఫీలతో పాటు రూ.7వేలు నగదును కూడా బహుకరించారన్నారు. గెలుపొందిన క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ ఇందుకూరి రఘురాజు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్య శేఖర్, ఎస్ కోట స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అట్లూరి శ్రీవెంకట్రావు, ఆనల మోహన్, ఆనల రమేష్, ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ మహమ్మద్ అస్లాం, చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

నెమలాంలో 'పొలం పిలుస్తోంది'

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సునీల్ కుమార్ మాట్లాడుతూ వరిలో వచ్చే తెగుళ్ల వాటి యాజమాన్య పద్ధతుల గురించి, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మజ్జి నరసింహులు, ఉప సర్పంచ్, వెటర్నరీ అధికారి, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టిన అధికారులు

రేగిడి: మండలంలో ఆర్.ఆమదాలవలస కాలనీ వద్ద ఎయిర్ వాల్వ్ లీక్ అవ్వడంతో నీరు వృథాగా పోతున్న విషయాన్ని తెలుసుకొని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి గొర్లె శ్రీ చరణ్ స్పందించి బుధవారం కొత్త ఎయిర్ వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో లీకైన తాగునీరు అరికట్టడంతో కాలనీ వాసులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు వృథాగా పోయిన, మరమ్మతులకు గురైన తక్షణమే సమాచారం అందించాలని కోరారు.

ఎస్‌సి, బిసి కాలనీలో సిసి రోడ్లు వేయాలి

బొబ్బిలి: ఎస్‌సి, బిసి కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని సిపిఎం పార్టీ శాఖ మహా సభలో తీర్మానించారు. మండంలోని చిత్రకోట బొడ్డవలసలో బుధవారం సిపిఎం పార్టీ శాఖ మహాసభ నిర్వహించారు. అర్హులైన వితంతువులకు, వృద్ధులకు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని, ఉపాధి హామీ పనులు ప్రతి కుటుంబానికి వంద రోజులు కల్పించాలని తీర్మానించారు. ఈ మహాసభలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలం, శాఖ కార్యదర్శి కాగానా గణేష్, సభ్యులు శివ నాయుడు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన భూ వివాదం

భోగాపురం: మండలంలోని ముంజేరు రెవెన్యూ పరిధిలో బుధవారం జరిగిన ఓ భూవివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఒక సంస్థ కొనుగోలు చేసిన భూమిలో ప్రహరీ గోడ నిర్మాణ కోసం ముంజేరు పరిధిలోని జెసిబితో పనులు ప్రారంభించింది. దీంతో అదే పంచాయతీలోని దనాల పేటకు చెందిన కొంతమంది తాము ఆ భూమిని అమ్మలేదని అది తమ భూమి అంటూ పనులను అడ్డుకున్నారు. ఇంతలో పోలీసులు చేరుకొని పరిస్థితిని పరివేక్షించారు. అనంతరం తమ భూమికి సంబంధించిన రికార్డులు తీసుకుని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఇరు వర్గాలకు సూచించారు.

మినీ పోస్టాఫీసు ప్రారంభం

గుర్ల: భూపాలపురం గ్రామంలో పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని బుధవారం టిడిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, కిరణ్ కుమార్, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, గ్రామ టిడిపి నాయకులు చీర సత్యం మాస్టర్, రామ్మూర్తి ప్రారంభించారు. గ్రామంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్ మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ విషయంలో వివాదం

తపాల శాఖ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ విషయంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య వివాదం చెలరేగింది. జెడ్‌పిటిసి అప్పలనాయుడు, సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ కనీసం ప్రోటోకాల్ లేకుండా ఇష్టారాజ్యంగా టిడిపి నాయకులు పోస్టల్ కార్యాలయం ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించకుండా చేయడం వల్ల ఇబ్బందులు తప్పవన్నారు. ఇరు వర్గాల మధ్య వివాదం పెరగడంతో ఎస్‌ఐ నారాయణరావు జోక్యం చేసుకొని వారిని బయటికి పంపించారు. దీంతోజెడ్‌పిటిసి, సర్పంచ్ ఇంటికి వెళ్లిపోయారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

బొబ్బిలి: ఆకలి తీర్చే ఆహారాన్ని వృథా చేయొద్దని రోటరీ జిల్లా ఛైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక కళాశాల బాలికల వసతి గృహంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి రోటరీ క్లబ్ కార్యదర్శి సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఆహార భద్రత, వృథాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ 30 శాతం ఆహారం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, చిన్నారావు, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

8 ఏళ్లుగా నిర్మాణంలోనే..

● ప్రారంభానికి నోచని బాలికల వసతి గృహం ● కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పూర్తికాని భవనం ● అదనంగా మరో రూ.21లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి- రేగిడి

పేద బాలికల విద్యాభ్యాసం కలగానే మిగిలింది. ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికల విద్య కోసం 2016లో అప్పటి ప్రభుత్వం మండలానికి ఒక హాస్టల్ నిర్మాణానికి రూ.1.32 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటికి టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లు నిర్మాణాలు మొదలుపెట్టినప్పటికీ వారి నిర్లక్ష్యానికి 8 ఏళ్ల గడిచినా భవనాలు పూర్తి కాలేదు. దీంతో ఈ హాస్టల్ భవనాలు అలంకార ప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా బాలికల హాస్టల్ విద్య కలగానే మిగిలింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సమగ్ర శిక్ష అధికారుల పర్యవేక్షణ లోపం బాలికల హాస్టల్ నిర్మాణానికి శాపంగా మారాయి.

మండలంలోని లక్ష్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల హాస్టల్ నిర్మాణం కోసం 2016లో రూ.1.32 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇప్పటికి 8 ఏళ్ల గడిచినా హాస్టల్ భవనం పూర్తి కాకపోవడంతో పేద బాలికల విద్యకు దూరమవుతున్నారు. వాస్తవానికి అప్పట్లో వసతి గృహ నిర్మాణానికి ఆన్‌లైన్‌లో శ్రీకాకుళం జిల్లా స్టేషన్ ఆమదాలవలసకు చెందిన పివి సూర్యనారాయణ టెండర్ దక్కించుకున్నారు. ఈ వసతి గృహ నిర్మాణానికి సంబంధించి సబ్ కాంట్రాక్టర్‌గా మండలంలోని కోడిశ గ్రామానికి చెందిన నెల్లి గజేంద్రనాయుడు వ్యవహరించారు. నిర్మాణ పనులు ప్రారంభమైన కొన్నాళ్లకు ఆయన మృతి చెందారు. ఆయన మరణాంతరం అతని కుమారుడు ధనంజయరావు నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు సకాలంలో అందకపోవడం, నిర్లక్ష్యం కారణంగా అప్పటి నుంచి ఎనిమిదేళ్లగా నిర్మాణం సాగుతూనే ఉంది. నిర్మాణం పూర్తికాకపోవడంతో భవనాలను ప్రారంభించలేదు. దీంతో భవనం అలంకార ప్రాయంగా మిగిలింది.

ప్రారంభానికి నోచుకోని వసతి గృహం

పర్యవేక్షణా లోపం

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల పర్యవేక్షణా లోపం కూడా పనులు మందగించడానికి దోహదపడ్డాయి. సమగ్ర శిక్ష అధికారుల పర్యవేక్షణ జరిపితే ఇన్నేళ్లు పాటు ఈ భవనం నిర్మాణాలు జరిగి ఉండేవి కావని పలువురు విమర్శిస్తున్నారు.

రూ.21లక్షల అదనంగా మంజూరు

లక్ష్మంపురం బాలికల హాస్టల్‌కు నిధులు చాలక మధ్యలో పనులు నిలిచిపోయాయన్న విషయాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఇటీవల వసతి గృహ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అదనంగా మరో రూ. 21 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికైనా ఈ నిధులతో నిర్మాణాల చేపట్టి పేద బాలికల విద్యార్థినులకు విద్యను అందించే దిశగా కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్తికాకపోయినా ప్రారంభించండి

లక్ష్మంపురం ఉన్నత పాఠశాలలో బాలికల హాస్టల్ నిర్మాణాలు పూర్తి కాకపోయినా విద్యార్థినులను చేర్చుకుని తరగతులు ప్రారంభించాలని రేగిడి ఎంఆర్‌సి కార్యాలయానికి డిఇఒ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఎటువంటి పోస్టులు లేకుండా ఎలా ప్రారంభించాలో మండల విద్యాశాఖ అధికారులు తలలు పీక్కుంటున్నారు. ఇప్పటికే వంట సామాగ్రి ఎంఆర్‌సికి చేరాయి. అయితే నిర్మాణం పూర్తికాకపోవడం, సరిపడా ఉద్యోగ సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ ఎలా సాధ్యమని అధికారులు మల్ల గుల్లాలు పడుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పూర్తి కాలేదు

బాలికల హాస్టల్ నిర్మాణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆలస్యమైంది. అప్పటి సమగ్ర శిక్ష ఎఇ, కాంట్రాక్టర్ మధ్య ఎటువంటి ఒప్పందం ఉందో నాకు తెలియదు. నేను కొత్తగా విధుల్లో చేరాను. ఈ విషయం ఎమ్మెల్యే కొండ్రు మురళి తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.21 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రారంభించాల్సి ఉంది.

దాలయ్య, సమగ్ర శిక్ష ఎఇ

గురుకులంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడు పేట గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ టిఎం ఫ్లోరెన్స్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి హాస్టల్‌లో ఉన్న ఆహార దినుసులు పరిశీలించారు. సరుకులు ఏవైనా బాగోకపోతే వెండర్స్‌కి తిరిగి పంపించాలని వార్డెన్‌కి సూచించారు. ఈ నెల 18వ తేదీన నెల్లిమర్లలో జరగనున్న సైన్స్ ఫైర్ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఇంటర్ విద్యార్థులను క్వార్టర్లీ ఎగ్జామినేషన్‌కి బాగా చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్ యు ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్

ఇది ప్రజా పండగ.. పార్టీ ఉత్సవం కాదు

ఆప్ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మవారి పండుగను ప్రజల పండగగా కాకుండా పార్టీ ఉత్సవంగా నిర్వహించారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పైల రమేష్ రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సిరిమానోత్సవాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే అధికార పార్టీ ప్రతినిధులు, అధికారులు,ఉత్సవాలు నిర్వహణ సందర్భంగా వ్యవహరించిన తీరుతీవ్ర నిరాశ నిరాశ కలిగించిందన్నారు. ప్రజాధనంతో నిర్వహించే ఈ ఉత్సవాలలో అన్ని పార్టీలకు,సమాజ సేవకులకు ప్రాతినిధ్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు.ఉత్సవాలు ప్రారంభ వేదికపై కేవలం తెలుగుదేశం పార్టీ నేతలకే అవకాశం కల్పించడం, మిగతా పార్టీల ప్రతినిధులను, సామాజిక కార్యకర్తలను విస్మరించడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో జరుపుకునే ఈ వేడుకలు ఏ పార్టీకి సొత్తు కాదని, ఈ ఉత్సవాలు అందరినీ కలుపుకునే విధంగా జరపాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారి పార్టీ నేతలను పక్కన పెడితే కనీసం జిల్లా యంత్రాంగం వ్యవహరించిన తీరు ఆక్షేపణీయంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి ఉత్సవాలను ఒక పార్టీ ఉత్సవాలుగా కాకుండా ప్రజల పండగగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులోనైనా ఈ ఉత్సవాలను పార్టీ ఉత్సవాలుగా కాకుండా ప్రజా ఉత్సవాలుగా జరిపించాలని హితవు పలికారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై దర్యాప్తు చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

సిబిఎం పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ పై సమగ్ర దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్, ప్రభుత్వానికి లేఖలు రాయనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. స్థానిక దర్బార్ మహాలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న సిబిఎం పాఠశాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని పట్టణానికి 6కిలోమీటర్లు దూరంలో ఉన్న స్థలాన్ని, భవనాన్ని ఇవ్వడం అన్యాయమన్నారు. సిబిఎం పాఠశాల వ్యవహారంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్, ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. నిబంధనలు తుంగలోకి తొక్కి రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న రూ.50కోట్లు వికువ చేసే ఆస్తిని తీసుకుని కోమటిపల్లి వద్ద రూ.5కోట్లు విలువ చేసే ఆస్తి ఇవ్వడం చూస్తే ఎంత అవినీతి జరిగిందో అర్థమవుతోందన్నారు. నిబంధనలు ప్రకారం రిజిస్ట్రేషన్ జరిగితే బొబ్బిలిలో ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదని ప్రశ్నించారు. చీపురుపల్లిలో రిజిస్ట్రేషన్ చేయడంతో పలు అనుమానాలు వస్తున్నాయని చెప్పారు. వైసిపి హయాంలో భూ కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు.

ప్రభుత్వ పెద్దల పాత్ర తేల్చాలని కోరారు. వాస్తవాలు బయటకు తీసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగితే జీవితంలో తప్పు చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బడుగు బలహీన వర్గాలు కోసం సిబిఎం పాఠశాల స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూస్తామని చెప్పారు. కక్షసాధింపు చర్యలు కాకుండా ప్రజల ఆస్తిని కాపాడడం తమ లక్ష్యమని చెప్పారు. వాస్తవాలు బయటకు తీస్తామని ఎమ్మెల్యే అన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 18వ తేదీన జామిలో నిర్వహించే రైతు సదస్సును పాడి రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గల మహిళా పాల ఉత్పత్తిదారుల సంపూర్ణ సహాయక సహకార సంఘం వద్ద ఉన్న పాల రైతులు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోడ పత్రికలు విడుదల చేశారు.

అనంతరం మద్దిల రమణ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి సమానంగా పాడి పరిశ్రమ ప్రధాన వృత్తిగా ఎదిగిందని, దేశంలో వ్యవసాయం గిట్టుబాటు ధర లేకపోవడం వ్యవసాయానికి పెట్టే ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం వివిధ పార్టీ రైతుల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 18 తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు జామి మండల కేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంక్ వెనకాల బుసర్ల రమణరావు కళ్యాణ మండపంలో జరుగు సదస్సులో జిల్లాలో గల పాలరైతులందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, కర్రి గణేష్, పెదగాడ అప్పలసత్యం, కొమ్మినేని లక్ష్మి, కొటాన లక్ష్మి, కొమ్మినేని నాయుడు, కృష్ణమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితులు తట్టుకునేలా పనులు

ప్రజాశక్తి - భోగాపురం

తీర ప్రాంత పరిస్థితులు తట్టుకునేలా విమానాశ్రయ నిర్మాణ పనులు చేపట్టాలని విశాఖ ఎంపి శ్రీభరత్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రతినెలా కేంద్ర పౌర విమానాయా శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలిస్తున్నారు. ఈ నెల విశాఖ ఎంపి భరత్, రాష్ట్ర మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, విశాఖపట్నం పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ విమానాశ్రయం రాబోయే 50 సంవత్సరాలు వరకు ఎటువంటి అవంతరాలు లేకుండా తీరప్రాంత పరిస్థితులకు తగ్గట్టుగా ఉండాలని తెలిపారు. విశాఖపట్నం నుంచి విమానాశ్రయం వరకు వేగంగా చేరుకునేలా రహదారుల అభివృద్ధిపై చర్చించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రయాణ సమయాన్ని తగ్గించే విధానంపై చర్చించారు. ప్రస్తుతం విమానాశ్రయం పనులు 45 శాతం పూర్తయినట్లు జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఆయనకు తెలిపారు. ఇచ్చిన టార్గెట్‌కు మించి 27శాతం అధిగమించి పనులు చేపట్టామని వారు తెలిపారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ డిసెంబర్ నెలాఖరికి పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తవుతుందని వివరిం చారు. విమానాశ్రయం ప్రారంభ దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులు సామర్థ్యంతో ప్రారంభమై భవిష్యత్తులో నాలుగు కోట్లకు విస్తరించనున్నట్లు తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎంపి, ఛైర్మన్

జిఒ 114ను అమలు చేయాలని నిరసన

రాజాం: జిఒ 114ను అమలు చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్స్ బుధవారం పసుపు రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేసేందుకు క్రమబద్ధీకరణ యాక్ట్ 30, జీవో నెంబర్ 114 ప్రకారం అందర్నీ రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ మేరకు ఎన్నికల కోడ్‌తో నిలిచిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్న తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వాపోయారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చలర్లు దొరబాబు, మన్మథ రావు, గోపి, ఈశ్వర్, వెంకటరావు, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో తవ్వకాలకు అడ్డేది?

ప్రజాశక్తి- సంతకవిటి, రాజాం

మండలంలోని తలాడ గ్రామ చెరువుల్లో దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన రెండు చెరువుల నుంచి జెసిబితో మట్టిని ఇతర గ్రామాలకు చెందిన కొంత మంది అక్రమార్కులు తవ్వి తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలతో భారీ గోతులు ఏర్పడుతున్నాయని, వర్షాకాలంలో పిల్లలు గోతుల లోతు అంచనా వేయలేక నీటిలో దిగి ప్రమాదాల బారిన పడే అవకాశం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేని తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అధికారుల కళ్లెదటే జరుగుతున్నా తమకు సంబంధం లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల మట్టి తవ్వకాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతుంది. చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్న వారిపై చర్యలు చేపట్టాలని గతంలో తహాశీల్దార్ ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మట్టితో ఉన్న ట్రాక్టర్‌ను విఆర్‌ఒ చూసినప్పటికీ, పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు చెరువు మట్టిని అక్రమంగా పరిసర ప్రాంతాలకు తరలించి లక్షల్లో సంపాదించుకుంటున్నారు. చెరువులను పెద్ద పెద్ద గుంతలు చేసి ప్రమాదకరంగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వాలు చెరువులను పరిరక్షించాలని పలు ప్రకటనలు చేసినప్పటికీ తలాడ విఆర్‌ఒ మాత్రం వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే తహాశీల్దార్ స్పందించి చెరువులను పరిశీలించి, విఆర్‌ఒపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెసిబితో తవ్వడం చెరువులో ఏర్పడ్డ గోతులు

పనులన్నీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం

● జిల్లాలో రూ.182 కోట్లతో 2,705 పనులు: కలెక్టర్
●సంక్రాంతిలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

ప్రజాశక్తి- డెంకాడ

ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ కార్యక్రమం కింద నియోజకవర్గంలో శిలా ఫలకాలు వేసిన పనులన్నిటినీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి తెలిపారు. ఈ పనులను ప్రజలు కూడా పర్యవేక్షించాలని, ఎక్కడా అవినీతి లేకుండా వేగంగా జరిగేలా చూడాలని కోరారు. బుధవారం ఆమె మండలంలోని పెద తాడివాడలో పల్లె పండగ కార్యక్రమం కింద గుర్తించిన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.24 కోట్ల రూపాయలతో 682 పనులను చేపడతామన్నారు. పెద తాడివాడకు 5 పనులను రూ.96లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.182 కోట్లతో 2,705 పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాసుదేవ రావు, మాజీ ఎంపిపి కందిచంద్ర శేఖర్, ఎంపిటిసిలు రమేష్, జగన్నాథ రావు, డ్వామా పీడీ సందీప్ మండల ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ భవాని, తహాశీల్దార్ పద్మావతి, టిడిపి, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలకు వెలుగు వస్తోందని, అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం నిమ్మలపాలెం, దేవాడ గొల్లలపాలెం గ్రామాల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.41 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, నాయకులు పొట్నూరు వెంకట రత్నాజీ, లెంక శ్రీను, నక్కరాజు చినరాము, కోరుపోలు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: పల్లె పండగతో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తీసుకున్నామని ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. సంకిలిలో బుధవారం సర్పంచ్ బుడుమూరు పట్టాభి అధ్యక్షతన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు కర్రి రమణ, గంగు కృష్ణ, నారు జనార్ధన రావుతో కలిసి సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల్లో ఐదు పనులకు సంబంధించి రూ.32లక్షలతో పనులు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటి పనులు వేగవంతం చేయాలని సూచించారు. వీరితోపాటు సవిరిగాన సింహాచలం, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉన్నారు.

డెంకాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, పక్కనే కలెక్టర్ అంబేద్కర్

పూసపాటిరేగ : పల్లెల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పండగలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎపి మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. బుధవారం మండలంలోని కుమిలిలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మతో పాటు జనసేన మండల పార్టీ అధ్యక్షులు జలపారి శివ, కూటమి నాయకులు దల్లి ముత్యాలరెడ్డి, మద్దిల మురళి, దంతులూరి సూర్యనారాయణరాజు, గుడివాడ జమరాజు, ఎంపిడిఒ ఎం. రాదిక, జెఇ శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం ఆయన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా దమరసింగి గ్రామంలో సీసీ రోడ్డు, కాలువలు, దమరసింగి నుంచి చనమల్లపేటకు బిటి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు అనుసంధానంగా సుభద్ర పురం జంక్షన్ నుండి చీపురుపల్లి వరకు డబల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్ నాయుడు, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ టి.కిరణ్ కుమార్, మండల నాయకులు పిల్లా అప్పల నాయుడు, కనిమేరక కృష్ణ, మండల అప్పల నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగులపల్లి నారాయణరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మండలంలోని రేవళ్లపాలెం గ్రామంలో స్థానిక మండల, గ్రామ నాయకులతో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవళ్లపాలెం గ్రామానికి కేటాయించిన రూ.40లక్షలలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, సర్పంచ్ జె.కృష్ణమ్మ, జి.పైడితల్లి నాయుడు, పాల్గొన్నారు.

బొండపల్లి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినతామరాపల్లిలో బుధవారం వివిధ అభివృద్ధి పనులకు సర్పంచ్ నడుపూరు భాస్కర్‌నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.గిరిబాల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామంలో ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలానికి రూ. 6.61కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. పెద్దగెడ్డ నీరు ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి లబ్ధి చేకూరే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, సర్పంచ్ మూడడ్ల సత్యం, ఎంపిటిసి పాలవలస గౌరు, ఎంపిడిఒ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాం ఆర్అండ్‌బి రోడ్డు నుంచి జగనన్న కాలనీ వరకూ, ఆర్అండ్‌బి రోడ్డు నుంచి జనపరెడ్డి ఈశ్వరరావు ఇంటి వరకూ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, ఎర్ర సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి కాకర భారతి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.